

'సత్యం'

ఆయన అసలు పేరు మీకు చెప్పను. కాని, అది మీకుకూడా తెలుసు. తెలుగు వ్రాయటం, చదవటం నేర్చిన వారిలో ఆయన పేరు విననివారు బహు కొద్దిమంది ఉంటారు. అయితే ఈ కథలో నేను ఆయన్ను 'రాజా' అని పిలుస్తాను. కారణం మీకే తెలుస్తుంది.

వాల్తేరులో విశ్వవిద్యాలయానికి కొంచెం దూరంలో ఒక పాత బంగళాలో ఉండేవా రాయన. అది ఎవరో మహారాజా వారిది. ఆయనకు ఉండటాని కిచ్చారు. నేను విశ్వవిద్యాలయంలో మనస్తత్త్వ శాస్త్రంలో ఉపాధ్యాయుణ్ణి. మా ఇల్లు ఆయన ఉన్న బంగళాకు దగ్గరే. మా పరిచయానికి అదే ఆధారం.

తరుచూ సాయంకాలం వాళ్లింటికి వెళ్లేవాణ్ణి. ఇతరు లెవరన్నా ఉంటే కాస్సేపు కూర్చుని వచ్చేసేవాణ్ణి. మే మిద్దరమే ఉన్నప్పుడు మాత్రం ప్రొద్దు పోయేది.

భగ్న ప్రేమికుల జాతక కథలన్నీ చదవడానికి బాగానే ఉన్నా అనుభవానికి బుసలు కొట్టే నాగసర్పాల వంటివి. ప్రేమ అనే రంగుల వలలో చిక్కుకొనకుండా ఉండాలే గాని, ఇక తప్పించుకోవడం ఎవరితరం కాదు. ప్రేమలో తారతమ్యాలెన్ని ఉన్నా మూలం ఒక్కటే — వాటి గమ్యం ఒక్కటే!

ఏకాంతం చిక్కగానే ఆయన 'వెంకయ్యా.' అని కేక వేసేవారు. నౌకరు వెంకయ్య వచ్చి సముద్రాని కెదురుగా ఉన్న బాల్కనీలో రెండు కుర్చీలు వేసేవాడు. చిన్న బల్లమీద విస్కీ, గ్లాసులూ మొదలైన సరంజామా అంతా అమర్చి వెళ్ళేవాడు. రాత్రికి, విశ్రాంతికి అది నాంది.

ఎదురుగా ఘోష పెడుతున్న సముద్రం. మరుగుల కిరీటాలతో, పసిడి పంజకావిటి, మిలమిలలాడుతూ లేచిపడే నీల తరంగాలు, జాలరుల పడవలు, దూరాన ఓడలు. మౌనంగా విస్కీ రక్తనాళాల్లో పారగా చేరుతోతున్న మేము.

చిత్రమేమిటంటే, ఆయనఎంతతాగినా స్వీయజీవితాన్ని గురించీ, సన్నిహితుల జీవితాలనుగురించీ మాట్లాడేవారు కాదు. సంఘంలోని పెద్దలూ, ప్రముఖులూ, సాహితీపరులూ, నాయకులూ, ధనికులూ, వారిని గురించిన విచిత్ర సన్నివేశాలూ– ఇదే మా లోకాభిరామాయణం. ఆయన చమత్కారంగా, కులాసాగా, ఒక్కొక్కసారి వ్యంగ్యంగా మాట్లాడగలరు.

"మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?" అని అడిగాను ఒకసారి.

"ఆ పంగతే నా కెన్నడూ తట్టలేదు" అని ఆయన–"మచ్చికైన ఏనుగు అడవి ఏనుగులను గోతిలో తోసినట్టు, పెళ్ళయిన వాళ్ళు ఎంతసేపూ తప్పించుకొన్న వాళ్ళ ముక్కుకు తాడు వేద్దామని చూస్తుంటారు. ఇది నేను చాలాసార్లు గమనించాను" అన్నారు.

నేను నవ్వాను.

నే నేదన్నా అడిగితే ఆయన మెచ్చుకొనే వారని కాదు. మౌనంగా ఊరుకొనే వారు. నేను ఎంతో జాగ్రత్తగా అదను చూసి అడిగేవాణ్ణి, ఆయన గత జీవితాన్ని గురించి తెలుసుకొందామనే కుతూహలం కొద్దీ. "నేను నువ్వను కొనేంత తాగలేదులే!" అని ఆయనమెల్లగా నవ్వేవారు.

ఆయన ఎంతైనా తాగగలరు తొణకకుండా, బెణకకుండా. నేను ఊరక ఆయనకు తోడుగా తాగితేనే, తడబడి తూలేవాణ్ణి; కునికేవాణ్ణి. ఒకసారి ఇంటికి వెళ్ళి వాంతి చేసుకొంటే, నా భార్య చివాట్లు పెట్టిందికూడా.

"మీరు తాగినప్పుడు రాస్తారా? అది మీ కేమన్నా ఉపకరిస్తుందా?" అని అడిగాను ఒకసారి.

"అబ్బే! నేను తాగినప్పుడు రాయను! రాసేటప్పుడు తాగను. విరివిగా రాసే రోజుల్లో అసలు తాగేవాణ్ణి కాదు!" అన్నారు ఆయన.

మామూలుగా సాయంత్రమైనా ఒక్కొక్క రోజు మధ్యాహ్నం, పొద్దున్నే కూడా మొదలు పెట్టే వా రాయన ఈ తతంగం.

"ఈ వేళ ఏమిటి పొద్దున్నే?" అని అడిగాను ఒక రోజున.

"కొంచెం బద్ధకంగా ఉంది!" అన్నా రాయన.

"అయితే ఇదేనా మందు! మంచి మందే!" అన్నాను.

"మనిషికి మహా ప్రమాదం ఏమిటి? చావేగదా! కాని నాకు చావులో నమ్మకం లేదు. అటు చూడు, ఆ మహా తరంగాలు, వాటి తలలపై మరుగుల మెరుగు పూలు, మన తలపైన దూదిపింజల మబ్బుల్లో సూర్యకిరణాల ఆటలు, లోపల బుద్ధదేవుని విగ్రహం, పైన ఎండపొడల మేలిమిఛాయలు! మృత్యువు ఎక్కడుంది? మనం జీవితాన్ని గురించి కలలు కన్నట్టే, మృత్యువును గురించికూడా కలలు కంటున్నాం బహుశా!" అన్నా రాయన.

"అయితే చావే లేదా? మన శరీరా లో?" అన్నాను.

"వాటి ధర్మం వాటిది!" అని ఆయన మౌనంగా ఊరుకొన్నారు. కొంచెం సేపున్న తరవాత "నేను మృత్యువును గురించి ఎన్నడూ ఆలోచించను!" అన్నారు.

నే నేమీ అనలేదు. 'కాని లోకంలో శోకముందనీ, క్లేశముందనీ, జరా రుజా మరణాలున్నాయనీ ఈయనకు తెలియదా?' అనుకొన్నాను. ఇన్ని ఏమీ తెలియకుండానే ఈయనకు అరవై అయిదు ఏళ్ళు వచ్చాయా? అసంభవం— ఈయనకు వాటిని గురించి మాట్లాడటం ఇష్టం లేదు, అంతే!

ఆయనకు 65-66 ఏళ్ళు ఉంటాయి. అయితే చూడటానికి ఏభై ఏళ్ల వాడిలా కనిపిస్తారు. మంచి దృఢకాయులు. ఆయనకు షష్టిపూర్తి ఎప్పుడో జరిగిందనీ, ఆ సందర్భంలో ఆంధ్రదేశం యావత్తూ ఆయనను చాలా ఘనంగా సన్మానించిందనికూడా నాకు తెలుసు. పత్రికలు చదివే, వినే ప్రతివాడికీ ఆయన పేరు తెలిసిపోయింది. చివరకు తన ప్రఖ్యాతితో తనకే విసుగు పుట్టే స్థితి వచ్చింది ఆయనకు.

ఇంత వయసువెనక ఏవో చాలా అనుభవాలు ఉంటాయి. వాటిని గురించి మాట్లాడటం ఆయన కిష్టం లేదు అంతే. అవి కష్టప్రదమైనవి కావటం వల్లా? విషాదకరమైనవి కావటంవల్లా? ఏమో?

వ్యక్తుల మనస్తత్వాలు గ్రహించగలనని నా కొక గర్వం. ఒక్కొక్క వ్యక్తినీ నా మనస్సులోనే, ఒక్కొక్క అరలో, సొరుగులో అమర్చి, అతనికి, 'ఇతను పలానా రకం' అని సులువుగా ఒక చీటీ అంటించేస్తాను. వాళ్ళ అంతర్యంలోని నిగూఢ రహస్యాలు కనుక్కొన్నానని నాలో నేను తృప్తి చెందుతాను. కాని ఇక్కడ నా సాచికలేమీ పారలేదు. నేను పూర్తిగా విఫలత చెందానని చెప్పక తప్పదు.

ఆయన నా కందని లోతులు గల మనిషి. ఆయన 'దోరణి', 'తరహా' నా కర్థం కాలేదనే చెప్పాలి. అస లాయన కొక 'దోరణి'గాని, 'తరహా'గాని లేదేమో?

ఒకసారి ఆయనను "మీ రెప్పుడన్నా ప్రేమించారా?" అని అడిగాను.

"అదికూడా ఒక ప్రశ్నా?" అన్నా రాయన.


"ఏం?"

"నాకు నా నౌకరు వెంకయ్యంటే ఎంతో ప్రేమ!"

"అబ్బే! అది కాదు!. . ."

"ఏం? అది ఎందుక్కాదు? ప్రేమ లన్నీ ఒకే రకంగా ఉండాలా? హంతకులూ, బందిపోట్లూ, జేబుదొంగలూ, కుంటి, గుడ్డివాళ్ళూ సైతం ప్రేమించటం లేదా? ఎవరి దోరణి వారిది; ఎవరి పరిమితి వారిది! తారతమ్యా లెన్ని ఉన్నా మూలం ఒకటే!"

"నా ఉద్దేశ్యం అది కాదు! ఎవరో ఒకరిని విశేషంగా. . ."



చతుశ్శృంగం ఫోటో—ఎస్. ఆర్. రామయ్య (హైదరాబాదు)

"మానవుడి వ్యక్తిగత సంబంధాల్లో ప్రతిదీ విశేషమే. ఏదీ తీసివేయతగినదీ కాదు, ఏదీ చెప్పుకోతగినదీ కాదు!" అని ఊరుకొన్నా రాయన.

నే నిక ఎక్కువ తరచి అడగలేక పోయాను. కాని ఆ రోజు ఆయన్ను గురించి చాలా సేపు ఆలోచించాను. ఆయన జీవితంలో ఏవో కొన్ని గొప్ప విషాద సంఘటనలు జరిగి ఉండాలి. వాటిని గురించి ఆలోచించటమే ఆయనకు కష్టప్రదంగా ఉండి ఉండాలి. అలాంటప్పుడు వాటిని గురించి మాట్లాడే ప్రసక్తి లేదు.

'ఆయన్ను గురించి ఏ మెరుగుదు' అని ఎవరన్నా అడిగితే ఏమీ లేదనే చెప్పాలి.

(తరువాయి 38 వ పేజీలో)

## నాగమణి

(35 వ పేజీ తరువాయి)

వ్యక్తిత్వపు చీకటి తెర వెనక నుంచి ఏయే రహస్యశక్తులు ఆయన జీవితాన్ని ప్రేరేపిస్తున్నాయో, ఏ రహస్యప్రవాహాలు అంతర్యంలోనుంచి సుడిగుండాలుగా బయట పడుతున్నాయో నే నెరుగను. ఈ శక్తుల, ప్రవాహాల అవధి ఏమిటో, తీర మెక్కడో అసలే ఊహించలేను.

మూడు, నాలుగు రోజుల నుంచి ఉక్కగా, ముసురుగా ఉంటున్నది. ఒక రోజు పొద్దున్నే తుఫాను లేచింది. ముందు కొంచెం తుంపరతో, గాలితో ప్రారంభించి పది, పదిహేను గంటల కల్లా పూర్తిగా విజృంభించింది. రెక్క లెక్కడ విరిగి పోతాయోనని కిటికీలూ, తలుపులన్నీ మూసివేయవలసి వచ్చింది. లైట్లు పోయి, లాంతర్లూ, కొవ్వొత్తులే దిక్కయి నాయి. భార్యా, ఇద్దరు పిల్లలూ మూడు రోజుల క్రితమే మమ్మల్ని చూడటానికి వచ్చిన బావమరిదితోనూ, ఉడికింది వేడి వేడిగా తినేశాం. సర్వరంధ్రాలూ మూసు కొన్నా, సందుల్లోంచి నీరు లోనికి వస్తూనే ఉన్నది. అది తుడిచేటప్పటికే తల ప్రాణం తోకకు వస్తున్నది. బయట ఏం ప్రళయం జరుగుతూందో తెలియదు కాని, ఫెళఫెళార్భాటాలు మాత్రం చెవులు చిల్లులు పడేలా ఉన్నవి.

సాయంత్రం సుమారు నాలుగు గంటలకు వర్షపు జోరు కొంచెం తగ్గినట్లున్నది. నేను వీధి తలుపు తెరవబోవటం చూసి, నా భార్య "ఎక్కడికండీ? మీ కేమన్నా దాదస్తమా?" అన్నది.

"ఇక్కడికే! ఇప్పుడే వస్తాను! తలుపు భద్రంగా వేసుకో!" అని చెప్పి ఆవిడ వద్దంటున్నా వినకుండా బయలుదేరాను. గాలి హోరున వీచి కొట్టింది. తలుపులు దభేలుమని మూసుకొన్నాయి. నేను గాలి వెనక్కు పడబోయి ఎలాగో ముందుకు సాగాను. కాని గాలి తోపిడికి తట్టుకోలేకపోతున్నాను.

ఆయన బంగళా నూరు గజాలకంటె ఎక్కువ లేదు. కాని, అక్కడకు చేరటానికి నాకు పావు గంట పట్టింది. చుట్టూ దృశ్యం బీభత్సంగా ఉంది. పెరటి తోటల్లోని అరటిచెట్లూ, చిన్న చిన్న మొక్కలూ, తీగెలూ మొదలంటా వాలిపోయాయి. చెట్లకొమ్మలు విరిగి, తోవనిండా పడి ఉన్నాయి. బాటపైన కంకర కొట్టుకుపోయి, అడుగు రాళ్ళు బయటపడ్డాయి. అక్కడక్కడ గోతుల్లో, గుంటల్లో నీరు. ఆ కాస్త దూరం వెళ్లటం పెద్ద ప్రళయమయింది. ఎలాగోలా చేరుకొని, తలుపు తట్టుతూ, వెంకయ్యను బిగ్గరగా కేకవేశాను.

వెంకయ్య తలుపు తీసి, నన్ను లోపలకు రానిచ్చి, వెంటనే మూసి వేశాడు. అతని వెనకే వెళ్లాను. వెంకయ్య టార్చిలైటు వెలుతురు చూపిస్తూ, "బాబుగారికి మొన్నటినుంచి తిండీ తిప్పలూ లేవు!" అన్నాడు. నా కర్థమయింది.

గదిలో అడుగు పెట్టగానే, ఆయన తలెత్తి చూసి, "ఎవరూ! ఓహో! నువ్వా? రా!" అన్నారు. సోఫాలో కూర్చుని ఉన్నారు. పక్కనే ఒక చిన్న బల్లమీద లాంతరు వెలుగుతున్నది. ఎదురుగా, గాజుబల్లమీద ఇంచుమించు ఖాళీగా ఉన్న విస్కీసీసా. నిండువి, ఖాళీవి ఒక 20—25 సోడాబుడ్లు ఉన్నాయి. ఆయన సీసాలో మిగిలినది గ్లాసులో పోసి, సోడా వేసి నా కిచ్చి, వెంకయ్యకు సైగ చేశారు. వెంకయ్య మరో కొత్త విస్కీసీసా తీసి, తెరిచి, బల్లమీద పెట్టి, ఖాళీసోడాబుడ్లు తీసుకొని వెళ్లిపోయాడు.

లాంతరు గుడ్డివెలుగులో మౌనంగా కొంతకాలం గడిచింది. ఇది మా పరిచయంలో చరమ ఘట్టమని నేనెప్పుడూ ఆ సాయంకాలం ఊహించను కూడా లేదు.

రక్తంలో పాకుతున్న విస్కీ మెల్లగా ఒక వెచ్చదనాన్ని, మత్తుని కలిగిస్తున్నది.

బయట మళ్లీ పెద్ద పెట్టున వర్షం మొదలైనట్టుంది. తుఫాను హోరు, తలుపుల కొట్టుకోవటం, లాంతరు వెలుగు ఊగటం, ఆ ప్రళయంలో సగం చీకటి, సగం వెలుగులో మే మిద్దరం.

ఆయన ఏదన్నా ఆలోచిస్తున్నారా? లేక నా లాగే ఒక రకమైన మత్తులో ఉన్నారా?



మిట్టమీద చెట్టు    ఫోటో—ఎమ్. వై. బెంద్రే (కొల్హాపూర్)

ఎక్కడో ఫెళఫెళా ఉరిమింది. ఆ పాతమేడ ఒక్కసారి ఊగినట్లనిపించింది. నా మత్తు వదిలి, ఒళ్లు ఝల్లుమన్నది. ఆయన మెల్లగా నవ్వి, "ఈ మేడ ఇంతేలే! అప్పుడప్పుడు ఉత్తినే ఊగుతూ ఉంటుంది!" అన్నారు.

గ్లాసులో మూడో వంతు ఒక్క గుక్కతో పూర్తిచేసి, తన గ్లాసు సగం విస్కీతో, సగం సోడాతో నింపుకొని, ఇంకా సగం ఉన్నా, నా గ్లాసు కూడా నింపారాయన.

"విస్కీ తాగడానికి ఇలాంటి తుఫాను మళ్లీ రావద్దూ?" అన్నారు.

"అవును! ఇలాంటి సన్నివేశం తరుచుగా రాదు!"

చీకటి ఎప్పుడు పడిందో తెలియదు. పగలూ, రాత్రీ ఒకటిగానే ఉన్నాయి! టైం చూస్తే తొమ్మిదయింది. తుఫాను ఏ మాత్రం తగ్గినట్లు లేదు.

"ఇంటికి వెళ్లాలి!" అన్నాను 'అది కనీస కర్తవ్య'మన్నట్లుగా.

"ఈ తుఫానులోనా? ఎక్కడి కెళతావు? ఉండు!" అన్నారు ఆయన. నే నేమీ అనలేదు. లోపల మా బావమరిది ఉన్నాడు గదా అని ధైర్యం! మగదిక్కు ఉన్నట్లేగా?

బయట తుఫానుహోరు తగ్గుతూ, హెచ్చుతూ కోట్ల కొలది కంఠాలబృంద గానంలా, సంద్రపుహోరుతో శ్రుతి కలుపుతూంది. మా రక్తనాళాల్లో మద్యం రొద పెడుతూంది. నేను జాగ్రత్తగా కొద్ది కొద్దిగానే తీసుకొంటున్నాను. కాని, నా ప్రాణాని కది చాలు.

"ఈ పెనుతుఫానులో సముద్రం ఆ గొప్ప అపురూపంగా ఉంటుంది" అన్నా రాయన.

"ఎవరు చూస్తారు?" అన్నాను.

"నీ కొక కథ తెలుసా?"

"ఏమి టది?"

"చైతన్య భగవానుడు పూరీ వెళ్లి, అక్కడ సాగరనీల సౌందర్యం చూసి, భ్రమసిపోయాడట! 'అదుగో కృష్ణుడు! అదుగో కృష్ణుడు!' అని కేకలు వేస్తూ, తోటివారు వారించినా, ఆగక సముద్రంలో దూకాడట!"

"ఆ తరవాత!"

"జ్ఞాపకం లేదు! కాని మిగిలిందంతా అప్రస్తుతం! మనకు కావలసింది కథ కాదు; ఆయన హృదయావేశం! భావోద్రేకం! ప్రాణాలు సైతం లెక్కించక సంద్రంలోకి ఉరికించిన మోక్షకాంక్షిత శక్తి!"

"దానినే మనస్తత్త్వంలో 'ఫిక్సేషన్' అంటాం. ఒక్కొక్కడు ఒక ధ్యానలో పడిపోతే దానిలోనే కొట్టుకుపోతూ ఉంటాడు."

"దానినే నేను 'నాగమణి' అంటాను!"

"అంటే?"

"మన జానపదగాథల్లో వినలేదా? ఉత్తమ జాతికి చెందిన మహా సర్పాల శిరస్సులపైన ఒక వయసు వచ్చాక అద్భుతమైన మణి ఆవిర్భవిస్తుందట! స్వీయకాంతితో తేజరిల్లే ఆ అనర్ఘ మహామణిలో ఎన్నో విచిత్రశక్తులుంటాయట. ఆ మహామణి కోసం వెదుకుతూ, ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోయారు. కాని, కట్టుకథల్లో తప్ప, అది ఎవ్వరికీ లభించినట్లు కనిపించదు."

"ఇంతకూ సారాంశం?"

"ప్రతి ఒక్కని జీవితంలోనూ ఏదో ఒక నాగమణి ఉంటుంది. అతడు దాని కోసం వెదుకుతూనే ఉంటాడు. అది అతనికి దుర్లభమే కావచ్చు. కాని వెతకటంలోనే అతని జీవితం సార్థకమౌతుంది. అదే అతని జీవిత పరమావధి!"

"నాకు మీరు చెప్పేది కొంచెం కొంచెం అర్థమౌతున్నది."

ఆయన అంతలో గొంతు తగ్గించి, "మరో రహస్యం. నా జీవితంలో మరెవ్వరికీ తెలియని గొప్ప రహస్యం చెప్పమన్నావా?" అని అడిగారు.

"చెప్పండి!" అన్నాను లోని కుతూహలం పైకి కనబడకుండా. బయట తుఫానులో, కారు చీకటిలో మెరుపులా ఏదో సత్యం సాక్షాత్కరించబోతున్నది గదా అనుకొన్నాను.

"నాగమణి అన్నది నా జీవితంలో క్షణమాత్రం మెరిసి, మాయమైపోయిన ఒక ఆడదాని పేరు!"

"పూర్తిగా చెప్పండి!"

"చెప్పటానికి అంతకంటే లేదు! అంతే కథ!" అన్నా రాయన.

నా కుతూహలం తీరలేదు. కాని, మరో మార్గం? మళ్లీ మౌనం! ఆయన తనలో తాను మునిగిపోయారు. బయట తుఫాను అంతకంతకూ పెచ్చరిల్లుతున్న ట్లుంది. జలప్రళయం కాదుగదా? మే మిద్దరమేనా తీర్నావశేషాం!

నాకు నాగమణి లేదు. చిన్న చిన్న ప్రమిదలే నాకు ఆధారం! అవే నా వరమావధి! అవి ఆరిపోతుంటాయి, వెలుగుతుంటాయి, ఏమాత్రం గాలి సోకినా రెపరెప కొట్టుకొంటాయి. ఇలాంటి తుఫానులో అవలే ఆగవు!

బయట తుఫాను హోరు మంద్ర స్థాయిలో, కోటి కోట్ల గొంతుల జోల పాటలా వినిపిస్తూనే ఉంది. నేను సోఫాలో వెనకకు జేరగిలబడి కునకసాగాను. ఆయన నన్ను లేపలేదు!

నేను లేచేటప్పటికే తెల్లవారింది. గాలి హోరు వినిపిస్తూనే ఉన్నది కాని, వర్షం కొంచెం తగ్గినట్లుగా ఉంది.

నాకు ఇంటిసంగతి జ్ఞాపకం వచ్చింది. "నేను వెళ్లి మళ్లీ సాయంత్రం వస్తా" నని చెప్పి బయలుదేరాను. ఆయన రాత్రి లాగే కూర్చుని ఉన్నారు. బల్లమీద రాత్రి సీసాకు బదులు మరో కొత్త సీసా వచ్చింది. నిద్రాహారాలు అక్కరలేని యోగి లాగా ఆయన తదేకధ్యానంలో ఉన్నారు. వెంకయ్యతో మళ్లీ సాయంత్రం వస్తానని చెప్పాను.

ఒక్కసారి చుట్టూ కలయ చూశాను. సముద్రం కోపోద్రేకంతో ఘూర్ణిల్లుతూ, ఎప్పుడు జనంమీద విరుచుకుపడు తుందా అన్నట్లుంది. విరిగిన కొమ్మలూ, ఆకులూ అలమూ బాటను కప్పేశాయి. గాలి నన్ను గద్దలాగా తన్నుకుపోతుందా అనిపించింది. చిన్న తుంపర పడుతూనే ఉన్నది. పైన ఇంకా కారుమబ్బులు కమ్ముకొనే ఉన్నవి.

ఇంటికి చేరగానే భార్య నా మీద విరుచుకుపడింది. తుఫాను సాకు చెప్పి ఏదో విధంగా సముదాయించాను. కొద్దిగా భోజనంచేసి పడుకొన్నాను.


నేను లేచేటప్పటికి చీకటి పడివచ్చి ఉంది. చూస్తే అయిదే అయింది. చక్కటి ప్లెష్టర్‌కోటి వేసుకొని బయలు దేరాను. నా భార్య నసిగింది కాని, "వర్షం లేదు లే"మ్మని నచ్చచెప్పి బయలు దేరాను.

నేను బంగళాకు పది గజాల దూరంలో ఉండగా హోరువర్షం లంకించుకొన్నది. ఒక్క ఉరుకుతో వరండాలో పడ్డాను. వెంకయ్య తలుపు తీస్తూ, "బాబుగారు మిమ్మల్ని ఒకటికి రెండు సార్లడిగారు! ఆయనగారు అట్సాగే కూచొన్నారు!" అన్నాడు.

నేను గదిలో అడుగు పెట్టాను. ఆయన తలెత్తి నన్ను చూడకుండానే గ్లాసులో విస్కీ పోసి, "ఇందు!" అని ఇచ్చారు. "సోడా లేదు! నీళ్లే గతి! నాకు అవికూడా అక్కర్లేదనుకో" అన్నారు. ఆయన ముఖం జేవురించి ఉన్నది. కళ్లు నెత్తురుజాత్తుల్లా వెలుగుతున్నవి. కాని, మనిషి నిశ్చలంగా ఉన్నారు.

"విశ్రాంతి తీసుకోగూడదా?" అన్నాను.

ఆయన మౌనంగా ఊరుకొన్నారు. కొంతసేపున్న తరవాత "నా గురించి మనస్సేమీ ఆదుర్దాపడకు!" అన్నారు.


గోపురం ఫోటో—యు. జి. రజ్‌పుత్ (కొల్హాపూర్)

బయట వర్షమూ, గాలీ బాగా ఉధృతంగా ఉన్నట్లున్నాయి. ఇల్లు మధ్య మధ్య ఊగుతూనే ఉంది. కాని, నేను అలవాటు పడిపోయాను. లాంతరు వెలుతురుకూడా కునుకుతున్నది. టైమ్ చూశాను. పదిన్నర అయింది. ఇక ఇంటికి రేపు పొద్దున్నే. 'బయట ఎలా ఉందా' అని ఒకసారి అవతలి గది కిటికీ తీసి చూశాను. నా ముఖాన ఎవరోకీ చాచి కొట్టినట్లయింది. చప్పున కిటికీ మూసే శాను. నాకుకూడా నిద్ర రావటంలే దివేళ.

ఆయన ఒకటి రెండు సార్లు లేచి నిలుచున్నారు. "ఎక్కడికి?" అన్నాను. ఆయన బదులు చెప్పకుండా మళ్లీ కూర్చున్నారు.

తుఫాను ఏమీ తగ్గటం లేదు. వర్షంకూడా ఎక్కువయినట్లు తోచింది. టైమ్ చూశాను! రాత్రి పన్నెండయింది.

బల్లమీద ఉన్న సీసాకూడా ఖాళీ అయింది. ఆయన లేచి, అల్మారు తీసి చూసి నిరాశగా—"అయిపోయిందే ఆఖరు సీసా!" అన్నారు. "థాంక్ గాడ్!" అన్నాను.

ఆయన అశాంతంగా పచారు చేయ సాగారు. కొంతసేపైన తరవాత మౌనంగా గుమ్మంకేసి వెళ్లటం చూసి, "ఎక్కడికి?" అంటూ నేనూ వెంబడించాను. "సముద్ర దర్శనానికి!" అంటూ ఆయన వెళ్లి పోతున్నారు. తలుపు తెరిచిన చప్పుడు విని వెంకయ్యకూడా వచ్చాడు. ఆయన మా వంక చూడకుండానే వెళ్లిపోతున్నారు. ఆయన వెనక నేనూ, నా వెనక వెంకయ్యా.

గాలి వెనక్కు తోసుకుపోతున్నది. వర్షం వెయ్యి కొరడాలతో చరుస్తున్నది. సముద్రపు హోరు అతి సమీపంలో, మా మీద విరుచుకుపడుతున్నదా అన్నట్లున్నది. ఒకసారి ఫెళఫెళా ఉరి మింది. మెరుపు మెరిసింది. వేనవేల విద్యుద్దీపాల వెలుగు కురిసి చీకటి విచ్చి కన్నులు మిరుమిట్లు గొలిపింది. ఆయన నాకు పది గజాల దూరంలో ఉన్నారు. అంతే దూరంలో నా వెనక వెంకయ్య ఉన్నాడు. కాని మా ముగ్గురి మధ్యా తుఫాను పెట్టనిగోడలా ఉన్నది. మళ్లీ చీకటి! చెవుల్లో తుఫాను హోరు! సముద్రపు హోరు! ఆ ప్రదేశమంతా ఇసుక దిబ్బలతో, చిన్న చిన్న ముళ్లకంపలతో నిండి ఉన్నది. పడుతూ, లేస్తూ, చప్పు డును బట్టి కేకలు వేస్తూ నేనూ, వెంకయ్యా ఆయన్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాం.

ఒడ్డు దగ్గరవుతున్నకొద్దీ మా ఆదుర్దా ఎక్కువయింది. కాని, ఆ కటిక చీకట్లో, కన్ను పొడుచుకొన్నా కానరావటం లేదు.

ఒక్కసారి మెరుపు మెరిసింది. ఆయన మా పక్కనే రెండు గజాల దూరంలో నిలబడి, సముద్రం కేసి చూస్తున్నారు. నేనూ, వెంకయ్యా ఒక అదుటున లంఘించి ఆయన రెండు చేతులూ పట్టుకొన్నాం. చీకటిలో మమ్మల్ని విడిపించుకోవాలని ఆయన పోరాడసాగారు. ఎలాగో విడిపించు కొని ముందుకు ఉరికారు. ఇంతలో మళ్లీ మెరుపు మెరిసింది. ఆయన నీటి అంచునే కనుపించారు. మేంకూడా ముందు కురికాం.

ఉవ్వెత్తున లేచిపడే మహాతరంగాల తుంపరల జల్లు మమ్మల్ని ముంచెత్తు తున్నది. నురుగు దివ్వెలు తలపై వెలిగే ఆ ఉత్తుంగ తరంగాలు వేనవేల మణిధర మహాసర్పాల్లా లేచి ఆడుతున్నాయి, వాటి సౌందర్యం చూశాక, అవి కాటు వేసినా పరవాలేదన్నట్లుంది.

మేము ఆయనను మళ్లీ పట్టుకొన్నాం కాని, ఆయన ఉన్మత్తుల కుండే ఏనుగు సత్తువతో పెనుగులాడసాగారు. మా చేతులు విడిపించుకొని ముందుకు ఉరికారు. మెరుపు వెలుగులో నడుము లోతు నీళ్లలో కనుపించారాయన. ఆయన లాగానే సముద్రంకూడా ఆయనను కౌగిలించుకోవటానికి ఉరుకు తున్నట్లు తోచింది. ఒక మహా తరంగం పది పన్నెండు అడుగుల ఎత్తున లేచి విరుచుకుపడింది. అది వెనకనున్న మమ్మల్నికూడా ముంచెత్తింది. వెంకయ్య నన్ను చేయి పట్టుకొని వెనక్కు లాగాడు.

కొంతసేపు నిలబడి మెరుపు వెలుగులో మళ్లీ తేరిపార చూశాం. ఎక్కడా ఆయన జాడ లేదు.

బరువుగా ఇంటికి చేరుకొన్నాం.

రెండు రోజుల తరవాత ఆయన శవం ఎక్కడో దూరాన ఒడ్డుకు కొట్టుకు వచ్చినట్లు తెలిసింది.

ఆయన 'నాగమణి'ని వెదుక్కొంటూ వెళ్లారు. బహుశా పాతాళ లోకంలో, ఎక్కడో ఏ నాగకన్యల వద్దనో అది ఆయనకు లభించే ఉండవచ్చునని నా నమ్మకం. ★